క్లుప్తంగా

ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతర పోరు

సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి కృష్ణ చైతన్య

నూజివీడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తీవ్రంగా వ్యతిరేకించి నిరంతర పోరాటం కొనసాగించాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి కృష్ణ చైతన్య పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. పట్టణంలోని అమర్ భవన్‌లో పార్టీ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలపై విద్యుత్ భారాలు మోపమని వాగ్దానం చేసిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత కరెంటు ట్రూఅప్ చార్జీలు, ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై భారం మోపుతున్నారని ధ్వజమెత్తారు. నిత్యావసర వస్తువుల ధరలు దారుణంగా పెరిగి సామాన్యుల బతుకులు దుర్భరంగా మారినా పాలకులకు చీమ కుట్టినట్లుగా కూడా లేదని దుయ్యబట్టారు. సీపీఐ నాయకులు కొమ్మన నాగేశ్వరరావు, నిమ్మగడ్డ నరసింహ, చంగల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు ఆచరణీయం



ముసునూరు: క్రీస్తును అనుసరించుటయే నిజమైన క్రిస్మస్ అని, ఆయన బోధనల ప్రకారం ప్రేమ, శాంతి మార్గాల్లో పయనించాలని పాస్టర్ కంభాల రాంబాబు అన్నారు. లోపూడిలోని బేతేలు నిరీక్షణ ప్రార్థన సేవా సంఘ చర్చి వద్ద సంఘ కాపరి పాస్టర్ ఎల్.భూషణం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి గ్రాండ్ సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. రెవరెండ్ వంగలపూడి జోసఫ్ క్రిస్మస్ సందేశం అందించి, కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. జెడ్పీటీసీ డాక్టర్ వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీ కోటగిరి రాజా నాయన 30 మంది పాస్టర్లకు నూతన వస్త్రాలు, బ్యాగులు పంపిణీ చేసి, న్యూ ఇయర్ క్యాలెండర్‌ను విడుదల చేశారు. ఫెలోషిప్ గౌరవాధ్యక్షులు యోహాను, అధ్యక్షుడు శ్యాంసన్, ఉపాధ్యక్షుడు ఫ్రాన్సిస్ తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

తిరువూరు: ఎన్టీఆర్ జిల్లా క్రీడా, యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువకేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం తిరువూరు శ్రీ వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో బ్లాక్ స్థాయి క్రీడా పోటీలు జరిగాయి. వాలీబాల్, రన్నింగ్, షటిల్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. వాహినీ కళాశాల చైర్మన్ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ నాగేంద్రబాబు, కరస్పాండెంట్ నాగేశ్వరరావు, కోశాధికారి కిశోర్, జిల్లాలోని పలు కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

మోడల్ పేపర్స్ పంపిణీ

ఊటుకూరు(గంపలగూడెం): ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు మోడల్ పేపర్స్ బుక్ లెట్లను పంపిణీ చేయడం అభినందనీయమని ఊటుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రామదాసు అన్నారు. లెక్కలు, ఇంగ్లిష్ మోడల్ పేపర్స్ బుక్ లెట్‌లను పాఠశాల మ్యాథ్స్ టీచర్ ఎం. చెన్నారావు, ఇంగ్లిష్ టీచర్ ఎన్. జవహర్ జ్యోతి సౌజన్యంతో విద్యార్థులకు శుక్రవారం అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

చాట్రాయి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని డెప్యూటీ డీఎంహెచ్‌ఓ లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం మధ్యాహ్న భోజనం తిని అస్వస్థతకు గురైన మండలంలోని కోటపాడు యూపీ స్కూల్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పరిశుభ్రమైన తాగునీరు అందించాలని, స్కూల్‌లో వాటర్ ట్యాంకును శుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. డీఎస్‌ఓ నరేంద్ర కృష్ణ, పీహెచ్‌సీ వైద్యాధికారి విజయలక్ష్మి, చనుబండ పీహెచ్‌సీ వైద్యులు దుర్గాప్రసాద్, ఎంఈఓ బ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌ను సందర్శించిన డీఈఓ

నూజివీడు: విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని శుచిగా, రుచిగా వండి పెట్టాలని ఏలూరు జిల్లా విద్యా శాఖాధికారి ఎం.వెంకట లక్ష్మమ్మ అన్నారు. పట్టణంలోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌ను శుక్రవారం డీఈఓ సందర్శించారు. మధ్యాహ్న భోజనం తయారీని, వంట షెడ్ పరిసరాలను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనాన్ని తయారు చేస్తున్నారా, లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం అప్పారావు పాల్గొన్నారు.

16 నుంచి ధనుర్మాసోత్సవాలు

తిరువూరు: స్థానిక వేంకటాచలస్వామి దేవస్థానంలో ఈ నెల 16 నుంచి ధనుర్మాసం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయ అర్చకుడు దేవయాజనం వేణుగోపాలాచార్యులు తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 6 గంటలకు సేవాకాలం, సాయంత్రం 6 గంటలకు విష్ణు సహస్రనామ పారాయణం, వివిధ రకాల పూలతో సహస్ర నామార్చన జరుగుతుందన్నారు. 24న తిరుప్పావై సేవ, 26న లక్ష తులసి పూజ, 29న ఫలయాగం, జనవరి 2న గాజుల ఉత్సవం, 5న వైష్ణవ తదియారాధన, 8న ముత్యాల హారతి, 10న వైకుంఠ ఏకాదశి, 11న కూడార్వై ఉత్సవం జరుగుతుందని చెప్పారు.

సూపర్ సిక్స్ హామీలతో కూటమి మోసం

- ప్రభుత్వ తీరుపై వైఎస్సార్ సీపీ నేతల మండిపాటు
- కలెక్టరేట్ వద్ద అరెస్ట్ చేసి ఇబ్రహీంపట్నం తరలింపు
- వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేసిన పోలీసులు
- ప్రజలు, రైతుల సమస్యలు గాలికొదిలిన ప్రభుత్వం



ఇబ్రహీంపట్నంలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు దేవినేని అవినాష్, జగన్‌మోహనరావు, ఆసిఫ్ తదితరులు

ఇబ్రహీంపట్నం: సూపర్ సిక్స్ హామీలతో కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని వైఎస్సార్ సీపీ నాయకులు విమర్శించారు. వ్యవసాయానికి ఏడాదికి రూ.20 వేలు ఇస్తానని మోసం చేసిన ప్రభుత్వ తీరుపై వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు విజయవాడ కలెక్టరేట్ వద్ద వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్తున్న వైఎస్సార్ సీపీ నాయకులను అరెస్టు చేసి ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌కు శుక్రవారం తరలించారు. రైతులకు బాసటగా నిలిచిన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, నందిగామ, జగ్గయ్యపేట, విజయవాడ పశ్చిమ నియోజకవర్గాల సమన్వయకర్తలు మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు, ఆసిఫ్, తన్నీరు నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ మొండితోక అరుణ కుమార్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు వేములకొండ తిరుపతిరావు, అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, జి.కొండూరు ఎంపీపీ వేములకొండ లక్ష్మీ తిరుపతమ్మ, కార్పొరేటర్ పి. చైతన్యరెడ్డి, గరికపాటి రాంబాబు, వేల్పుల రవి కుమార్ తదితరులను అరెస్టు చేసి పోలీస్ వ్యాన్‌లో తీసుకొచ్చారు. అరెస్టు అయిన వారికి సంఘీభావం తెలిపేందుకు నందిగామ, జగ్గయ్యపేట, తిరువూరు, మైలవరం నియోజకవర్గాలలోని వివిధ మండలాలు, గ్రామాల నుంచి పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి కూటమి ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా పోలీస్ స్టేషన్‌లో నినాదాలు చేశారు. విజయవాడలో సీఎం చంద్రబాబు సమావేశం ముగిసిన అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. పోలీస్ స్టేషన్ నుంచి ర్యాలీగా శక్తినగర్ వద్ద దివంగత నేత వైఎస్సార్ విగ్రహం వద్దకు చేరుకుని పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రైతుల సమస్యలపై వినతిపత్రం ఇవ్వడం తప్పా?

అనంతరం మీడియా సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అవినాష్ మాట్లాడుతూ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు పది రోజులుగా రైతులకు తోడుగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకుని అనుమతులు తీసుకుంటే రెండు రోజుల కిందట ప్రభుత్వ కార్యక్రమం ఏర్పాటు చేసి వైఎస్సార్ సీపీ నేతలను అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. రైతుల సమస్యలు, ఆవేదన, ఇబ్బందులపై కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వడం తప్పా అని ప్రశ్నించారు. పోలీసుల తీరును తప్పుపట్టారు. కూటమి నేతలు, ముఖ్యమంత్రి, ఉప ముఖ్య మంత్రికి దమ్ము ధైర్యం ఉంటే ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని సవాల్ విసిరారు. ధాన్యం కొనుగోలు వ్యవస్థను దళారుల చేతిలో పెట్టారని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్‌రావు మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని పక్కన పెట్టి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ ప్రతిపక్షాలను భయపెడుతున్నారని, ఎవరూ భయపడరని పేర్కొన్నారు. ప్రజా సమస్యలు, ముఖ్యంగా రైతాంగం తరఫున శాంతియుతంగా పోరాటం చేస్తుంటే అరెస్టులు చేయడం అన్యాయమన్నారు. మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ రైతులకు రాజకీయ పక్షాలు అండగా ఉండకూడదా అని నిలదీశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులకు వివిధ రకాల రాయితీలు అందజేశామన్నారు. కూటమి నేతలు రూ.20 వేలు పెట్టుబడి సాయం ప్రస్తావన లేకుండా చేశారని విమర్శించారు.

పలువురు నేతల సంఘీభావం

ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌కు తరలించిన జిల్లాలోని పలువురు వైఎస్సార్ సీపీ నేతలను నియోజకవర్గ సీనియర్ నాయకులు సర్నాల తిరుపతిరావు, జోగి రాము, మేడపాటి నాగిరెడ్డి, మిక్కిలి శరభయ్య, పోరంకి శ్రీనివాసరాజు, నల్లమోతు ప్రకాష్, దయాకర్, జి.రాణి, దయాసాగర్, కోమటి కోటేశ్వరరావు, బాణావత్ బాలాజీ, వివిధ మండలాల నాయకులు తరలివచ్చి సంఘీభావం తెలిపారు.

అడ్డంకులు ఎదురైనా ముందుకు సాగుతాం

మంద కృష్ణ మాదిగ



నూజివీడు: సమాజమంతా ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఉంటే మాలలు మాత్రం వర్గీకరణను అడ్డుకోవాలని తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని, ఎన్ని అడ్డంకులు ఎదురైనా ముందుకు సాగుతామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణమాదిగ అన్నారు. నూజివీడు నియోజకవర్గ మాదిగ ఆత్మీయ కలయిక బహిరంగ సభ శుక్రవారం పట్టణంలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించారు. కృష్ణమాదిగ మాట్లాడుతూ దళితుల్లో 59 కులాలు ఉంటే వారందరికి రిజర్వేషన్ ఫలాలు అందాలని ఎమ్మార్పీఎస్ పోరాటం చేస్తుంటే మాలలు మాత్రం రిజర్వేషన్ ఫలాలన్నీ మాకే దక్కాలని వర్గీకరణను వ్యతిరేకిస్తున్నారన్నారు. సాధించుకున్న పోరాట ఫలాలను అమలు చేయించుకుంటామన్నారు. నూజివీడు మార్కెట్‌యార్డు చైర్మన్ పదవి ఎస్సీలకు రిజర్వ్ అయితే రెండో రోజే దళిత సోదరుల్లో ఒకరికి ఇస్తానన్నారు. తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ సామాజిక ఉద్యమ వీరుడు కృష్ణమాదిగ అని అన్నారు. నాయకులు పాల్గొన్నారు.

రైతులపై బీమా భారం

- పంటల బీమాకు మంగళం
- గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే బీమా చెల్లింపు
- రైతులు ప్రీమియం చెల్లిస్తేనే బీమా
- ఆందోళనలో అన్నదాతలు



చొప్పరమెట్లలో సిద్ధం చేసిన నారుమడి

ఆగిరిపల్లి: అన్నదాతలు ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంటలు ప్రకృతి విపత్తుల వలన దెబ్బతింటే ప్రభుత్వం వారికి అండగా ఉంటూ ఆదుకోవాలి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అందుకు విరుద్ధంగా పని చేస్తోంది. రైతులకు అండగా ఉండటం మాట అటుంచితే రైతు వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ రైతులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకానికి కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. వర్షాలు, తుపాన్లతో పంటకు నష్టం వాటిల్లినప్పుడు రైతులను ఆదుకునేందుకు దోహదపడుతుందనే ఉద్దేశ్యంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2019 ఖరీఫ్ సీజన్ నుంచే ఉచిత పంటల బీమా పథకాన్ని ఈ–క్రాప్ నమోదు చేసి సాగు విస్తీర్ణం అంతటికి బీమా వర్తించేలా ప్రభుత్వమే రైతుల తరఫున ప్రీమియం చెల్లించేది. రైతులపై ఒక్క రూపాయి కూడా భారం పడేది కాదు. బీమా ప్రీమియం చెల్లించేందుకు రైతులు ఆర్థిక ఇబ్బంది పడాల్సిన అవసరం ఉండేది కాదు. పంటలకు నష్టం వాటిల్లితే అతి తక్కువ సమయంలోనే రైతులకు పరిహారం అందేది. మండలంలో 2021 ఖరీఫ్ సీజన్‌లో తుపాను ప్రభావంతో పంటలు దెబ్బతినగా వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం కింద వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పరిహారం అందించింది. మండలంలో రైతులు 4,800 ఎకరాల్లో వరి, 1,100 ఎకరాల్లో మొక్కజొన్న, 19,000 ఎకరాల్లో మామిడి సాగు చేస్తున్నారు.

రైతుల ఆవేదన..

చంద్రబాబు ప్రభుత్వం ఉచిత పంటల బీమా రద్దు చేయడంతో ప్రీమియం భారం రైతులపై పడుతుంది. రబీ సీజన్‌కు సంబంధించి పంట బీమా కోసం రైతులే ప్రీమియం సొమ్ము చెల్లించాలంటూ కూటమి ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుంది. దీంతో ప్రభుత్వం ఈ విధంగా నిర్ణయం తీసుకోవడం సరికాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం మాదిరిగా రైతుల తరఫున ప్రభుత్వమే బీమా సంస్థలకు ప్రీమియం చెల్లించాలని కోరుతున్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం కూడా ప్రభుత్వం ఇంకా అందించలేదని, అప్పులు చేసి పంట సాగు చేస్తున్నామని, ఇప్పుడు బీమా పథకాన్ని కూడా నీరు కారిస్తే ఎలా అని రైతులు ప్రశ్నిస్తున్నారు.

సమంజసం కాదు..



పంటల బీమాకు సంబంధించిన ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలి. గతంలో అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకం కొనసాగించాలి. ప్రభుత్వం రైతులపై భారం మోపడం సమంజసం కాదు. పెట్టుబడికే డబ్బులు లేక ఇబ్బందులు పడుతుంటే బీమా చెల్లించాలనడం అన్యాయం. రైతులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పెట్టుబడి సాయం అందించాలి.

–దాసరి రామారావు, వైఎస్సార్ సీపీ రైతు నాయకుడు, శోభనాపురం

అదనపు భారమే..



వాతావరణం అనుకూలించక వ్యవసాయంలో నష్టాలు చూస్తున్నాం. సాగులో పెట్టుబడుల భారం పెరిగి రైతుల పరిస్థితి నానాటికీ తీసికట్టుగా ఉంది. గతంతో పోలిస్తే రానురాను పెట్టుబడి వ్యయం పెరిగి అప్పులు మిగులుతున్నాయి. దీనికి తోడు బీమా ప్రీమియం చెల్లింపు అదనపు భారం కానుంది. రైతులపై ప్రీమియం భారం లేకుండా చూడాలి.

–చెన్ను శ్రీనివాసరావు, రైతు, కృష్ణవరం

ప్రీమియం చెల్లించాలి..



రబీ పంటకు సంబంధించి ఎకరాకు రూ.500 బీమా ప్రీమియం చెల్లించాలి. రూ.41 వేల బీమా వర్తిస్తుంది. మామిడికి ఎకరాకు రూ.2,250 బీమా ప్రీమియం చెల్లించాలి. కామన్ సర్వీస్ సెంటర్లలో రైతులకు సంబంధించిన వివరాలను నమోదు చేసి ప్రీమియం చెల్లించాలి. బీమా చెల్లించిన వారికి మాత్రమే పంట నష్ట పరిహారం అందుతుంది. ప్రతి రైతూ తప్పనిసరిగా ప్రీమియం చెల్లించాల్సిందే.

–పి.చెన్నారావు, ఏఓ, ఆగిరిపల్లి

రైతులకు బాసటగా కదిలిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



తిరువూరు నుంచి విజయవాడ వెళుతున్న నాయకులు, రైతులు

తిరువూరు: కూటమి ప్రభుత్వంలో రైతులకు జరుగుతున్న అన్యాయాలపై పోరాడేందుకు వైఎస్సార్ సీపీ ఇచ్చిన పిలుపు మేరకు తిరువూరు నియోజకవర్గం నుంచి రైతులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శుక్రవారం విజయవాడ తరలివెళ్లారు. పంటలకు మద్దతు ధర కల్పించడంలో, ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ఆందోళనకు వైఎస్సార్ సీపీ తిరువూరు పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, రైతులు తరలివెళ్లారు. పార్టీ నాయకులు కాలసాని గోపాల నాగేశ్వరరావు, పాపారావు, వేణు, పరసా నెహ్రూ, నగర పంచాయతీ కౌన్సిలర్లు మోదుగు ప్రసాద్, మూడు దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు సర్వం సిద్ధం

నూజివీడు: సాగునీటి చెరువులు, కాలువలకు సంబంధించి సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు రెవెన్యూ అధికారులు, నీటిపారుదల శాఖాధికారులు సర్వం సిద్ధం చేశారు. ఎన్నికల నిర్వహణకు సిబ్బందిని నియమించి మెటీరియల్‌ను పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. నూజివీడు మండలంలో మైనర్ ఇరిగేషన్‌కు సంబంధించి 23 చెరువులకు, మేజర్ ఇరిగేషన్‌కు సంబంధించి 35 టీసీలకు ఎన్నికలను నిర్వహించనున్నారు. ఒక్కొక్క చెరువుకు ఆరు టీసీలు ఉంటాయి. 100 ఎకరాలకు పైబడి ఆయకట్టు ఉన్న చెరువులకు మాత్రమే సాగునీటి సంఘాల ఎన్నికలను నిర్వహిస్తారు. టీసీ సభ్యులను రైతులు ఎన్నుకుంటారు. వారిలో ఒకరిని అధ్యక్షుడిగా, మరొకరిని ఉపాధ్యక్షుడిగా సభ్యులు ఎన్నుకుంటారు. ఎన్నికలు మూజువాణి పద్ధతిలో నిర్వహిస్తారు. ప్రతి టీసీకి ఒక పోలింగ్ అధికారి, ఒక అసిస్టెంట్ పోలింగ్ అధికారిని నియమించారు. ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఎన్నికలను నిర్వహిస్తారని తహసీల్దార్ బీవీ సుబ్బారావు తెలిపారు.

నీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

ఆగిరిపల్లి: మండలంలో నీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేశామని తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. ఓటర్లు ఓటర్ కార్డు, ఆధార్, పట్టాదారు పాస్ పుస్తకంతో ఓటు హక్కు వినియోగించుకోవచ్చని చెప్పారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

కిలేశపురం(ఇబ్రహీంపట్నం): పాలకేంద్రంలో పాలు పోసేందుకు వస్తున్న వ్యక్తిని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జూపూడికి చెందిన వ్యక్తి కాలికి గాయమైంది. కిలేశపురం గ్రామం వద్ద 65వ నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి ప్రమాదం జరిగింది. జూపూడికి చెందిన నడకుదిటి వెంకటేశ్వరరావు పాలు పోసేందుకు మోపెడ్‌పై కిలేశపురం గ్రామానికి చేరుకున్నాడు. హైవే మధ్యలో డివైడర్ దాటుతున్న సమయంలో విజయవాడ వైపు నుంచి వేగంగా దూసుకొచ్చిన కారు మోపెడ్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటేశ్వరరావు కాలు కింది భాగం వద్ద విరిగినట్లు గుర్తించారు. బాధితుడిని 108 వాహన సిబ్బంది చికిత్స నిమిత్తం విజయవాడ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

హనుమత్ వ్రతాలు ప్రారంభం



మేడూరులో హనుమత్ వ్రతం ఆచరిస్తున్న భక్తులు

మైలవరం: మైలవరంలోని హనుమాన్ దేవాలయాల్లో హనుమత్ దీక్షలు కార్యక్రమంలో భాగంగా అభిషేకాలు, హనుమత్ వ్రతాలు శుక్రవారం నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం జరిగింది. ద్వారకా తిరుమల దేవస్థానం దత్తత దేవాలయంలో ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు ఆధ్వర్యంలో వ్రతాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.

మేడూరు(గంపలగూడెం): గంపలగూడెం మండలం మేడూరు వీరాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం హనుమత్ వ్రతం నిర్వహించారు. ఆలయంలో నిర్వహిస్తున్న హరే రామ నామ సప్తాహ మహోత్సవాల్లో భాగంగా ఐదో రోజు కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు కోమండూరి ఆంజనేయచార్యులు విఘ్నేశ్వర పూజతో ప్రారంభించారు. 80 మంది దంపతులు పీటలపై కూర్చుని వ్రతాన్ని ఆచరించారు. గంపలగూడెం సీతారామచంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉప ఆలయంగా ఉన్న ఆంజనేయస్వామి వద్ద సామూహిక హనుమత్ వ్రతాన్ని ఆలయ అర్చకులు దేవయజనం శ్రీధరాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

సీపీఎం జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ

తోటమూల(గంపలగూడెం): ప్రజా సమస్యలపై సీపీఎం రాజీలేని పోరాటం చేస్తోందని పార్టీ జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని తోటమూలలో సీపీఎం గంపలగూడెం మండల 8వ మహాసభ జరిగింది. పలు సమస్యలపై చర్చించి తీర్మానాలు చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా మద్దిరెడ్డి వెంకటరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా గువ్వల సీతారామిరెడ్డి, జానపాటి వెంకటేశ్వరరావు, మీసాల గోపాలకృష్ణ, తేళ్లూరి శాంతకుమారి, మల్లవరపు కుటుంబరావు, బండి వీరబాబు, గుంటుపల్లి వీరభద్రం, బొమ్మారెడ్డి శివరామకృష్ణారెడ్డి ఎన్నికయ్యారు.

అన్నదానం ప్రారంభం

గంపలగూడెం: గంపలగూడెం వికాస తరంగిణి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. దాతల సహకారంతో అనాథలు, దివ్యాంగులు, వృద్ధులకు ప్రతిరోజు మధ్యాహ్నం అన్నదానం చేస్తామని ప్రతినిధులు చెప్పారు. దాతలు ఎవరైనా ముందుగా తెలియజేస్తే వారి పేరున అన్నదానం చేస్తామని వికాస తరంగిణి ప్రతినిధులు సముద్రాల జ్యోతి, వనమా సత్యవాణి, వనమా పద్మావతి తెలిపారు.

స్వర్ణాంధ్ర విజన్ కాదు.. రుణాంధ్ర విజన్

నూజివీడు: స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ 2047 ఉద్దేశాన్ని పరిశీలిస్తే అభివృద్ధి, సంక్షేమం కావాలంటే పెట్టుబడుల కోసం అప్పులు తప్పనిసరి అన్నట్లుగా ప్రజలను ఒప్పిస్తున్నట్లుగా ఉందని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.హరినాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. చంద్రబాబు నాయుడు విజన్ 2047 సాకారం కావాలంటే ప్రపంచ బ్యాంక్ అప్పులతో పాటు ప్రైవేట్ భాగస్వామ్యం తప్పనిసరి అనటం వల్ల సామాన్యుల నడ్డి విరిగేలా పన్నుల భారం పడనుందని హరినాథ్ హెచ్చరించారు. అమరావతి నిర్మాణంలో రాష్ట్రాన్ని 23 ఏళ్ల పాటు అప్పుల్లోకి నెడుతున్నట్లుగా స్పష్టమైందన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడపటానికి సహజ వనరులను సద్వినియోగం చేసుకోవాలని హరినాథ్ విజ్ఞప్తి చేశారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

నూజివీడు: జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నూజివీడులోని న్యాయస్థానాల ఆవరణలో శనివారం నిర్వహిస్తామని 15వ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ ఎ.నాగశైలజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేసుల పరిష్కారానికి సుముఖంగా ఉన్న కక్షిదారులు లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చన్నారు. ఉదయం పది గంటల నుంచి నిర్వహించనున్న లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఉపాధ్యాయులకు అభినందన

ముసునూరు: స్కూల్ అసిస్టెంట్ క్యాడర్‌లో రెగ్యులరైజేషన్ పొందిన ఉపాధ్యాయులు లక్ష్మీపతిరావు, దాసులను అభినందించి సర్వీస్ ధ్రువీకరణ పత్రాలను, సర్వీస్ రిజిస్టర్లను అందజేశారు. యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.పద్మకిశోర్, జి.రాంబాబు ఆధ్వర్యంలో వారిని సన్మానించారు. చెక్కపల్లి జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

16న రైల్వే పెన్షనర్స్ అదాలత్

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్‌షాప్‌లో ఈనెల 16న పెన్షనర్స్ అదాలత్ నిర్వహిస్తామని పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి షేక్ చాంద్‌బాష శుక్రవారం తెలిపారు. పెన్షనర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఐఓటీతో ఉద్యోగావకాశాలు మెండు

మైలవరం: ట్రిపుల్‌ఈ విద్యార్థులకు ఐఓటీతో ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐఓటీ) అప్లికేషన్స్ ఇన్ ఇంజినీరింగ్ అంశంపై ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు శుక్రవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఐఓటీని ఉపయోగించి సొంతంగా కంపెనీని ఎలా స్థాపించాలో వివరించారు. రిసోర్స్ పర్సన్ విజయవాడ ఆర్ అండ్ డీ ఇంజినీర్ పీఎస్ సత్యకుమార్ మాట్లాడుతూ ఐఓటీ అప్లికేషన్స్‌తో ఎటువంటి ప్రాజెక్టులు చేయవచ్చో తెలిపారు. ట్రిపుల్‌ఈ విభాగాధిపతి డాక్టర్ జె. శివహరిప్రసాద్ మాట్లాడారు. కోఆర్డినేటర్స్‌గా అసిస్టెంట్ ప్రొఫెసర్స్ ఏవీ రవికుమార్, ఇమ్రాన్ అబ్దుల్ వ్యవహరించారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి

ముసునూరు: భూమి వివాదంలో గాయపడిన కుటుంబానికి న్యాయం చేయాలని సీపీఐ నాయకుడు నిమ్మగడ్డ నరసింహ విజ్ఞప్తి చేశారు. చింతలవల్లిలో డేరంగుల గంగయ్య కుటుంబ సభ్యులపై గురువారం భౌతిక దాడి చేసి, గాయపర్చిన ఘటనలో బాధిత కుటుంబ సభ్యులకు సీపీఐ అండగా ఉంటుందని ఆయన ప్రకటించారు. దాడి చేసిన నాగరాజును శిక్షించి, బాధిత కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని కోరుతూ, స్థానిక వడ్డెర సంఘ సభ్యులతో కలిసి ముసునూరు రెవెన్యూ కార్యాలయంలో డీటీ వెంకటరమణకు వినతి పత్రం అందజేశారు. మండల నాయకుడు చెంగల వెంకటేశ్వరరావు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.